# అవధూతస్వామి

## డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

రాత్రి పదిగంటలు దాటి ఉంటుంది.

శివుణ్ణీ పార్వతినీ నిద్రపుచ్చి గుడి తలుపులు వేసేటప్పటికే శివరామశాస్త్రికి బాగా ఆయాసం వచ్చింది.

అరుపదులు నిండాయి. ముదిమి అలుపుతో ఆడుకొంటోంది.

గంభీర రూపానికి తగ్గ మేఘస్వరం! ఆ కంఠధ్వనికి తగ్గ పాండిత్య పాటవం! సరస్వతీ పుత్రుడని ఊరంతా పొగడుతారు. కాని శాస్త్రి మాత్రం "నేనెంత? నా పాండిత్యమెంత?" అని వినయంగా తనకు ఆపాదించిన గొప్పతనాన్ని త్రోసిపుచ్చుతూ ఉంటాడు.

అదీ ఆయన సంస్కారం!

ఊరిబయట శ్మశానవాటికకి కాస్త ఎడంగా వున్న శివాలయానికి జీతభత్యాలు లేని పూజారి అతడు.

తను నివేదించుకున్న అర్చనకు ఎంత ప్రాప్తమో దానితోనే తృప్తిపడడం శాస్త్రిగారి రోజువారీ జీవితంలో ఒక భాగం!

ఎంతో గొప్పమేధావి అయిన శాస్త్రి ఏమీ ఆర్జించకుండా నిత్యం పేదరికంలో మగ్గడం ఆయన భార్య భ్రమరాంబకు మాత్రం బొత్తిగా ఇష్టం ఉండేది కాదు. అయినా భర్త మాటను సరదాకైనా త్రోసిపుచ్చని దొడ్డ ఇల్లాలు ఆ తల్లి!

వారి గారాల కొడుకు సుబ్రహ్మణ్యశాస్త్రి! తండ్రి పోలికలు అన్నింటా పుణికిపుచ్చుకొన్నవాడు.

యశస్సు శాశ్వతం కాని ఐశ్వర్యం కాదని నాన్న చెప్పిన మాటలు- సుబ్రహ్మణ్యశాస్త్రికి ఎప్పుడూ గుర్తుకుంటాయి.

అందుకే ఫలం, పత్రం, పుష్పం, తోయం అంటూ ఎవరేమి ఇచ్చినా, ఎంత ఇచ్చినా పుచ్చుకొని వేదశ్రుతులను నిత్యం వల్లెవేస్తూ ఉంటాడు. అవసరాలకు తీరిపోగా మిగిలింది శివార్పణమంటూ ఏ దిక్కూలేనివారిని ఆదుకోవడం సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకృత్యాలలో అతి ముఖ్యమైంది.

తనయుని చూచీ, తన అర్ధాంగిని చూచీ ఎంతో సంతోషపడుతూ ఉంటాడు శివరామశాస్త్రి!

కొడుక్కి తగిన సంబంధం చూచి కోడల్ని తెచ్చుకోవాలన్న ముచ్చట రోజు రోజుకి ఎక్కువవుతోంది ఆయనకు.

గుడి తలుపులకు తాళంవేసి గట్టిగా లాగి చూచాడు. మెట్లు దిగి నెమ్మదిగా నడక సాగించాడు అంగవస్త్రాన్ని ఒంటినిండా కప్పుకొని శివనామస్మరణ చేస్తూ ఇంటికి వెళుతున్నాడు.

మాఘమాసపు చలి. గిజగిజలాడిస్తోంది. దానికితోడు ఊదరగొట్టే ఈదురు గాలి. శాస్త్రి నడకవేగం పెంచాడు. "ముసలితనమంటే ప్రకృతికి కూడా ఎంత ఎకిరింత" అని అనుకొన్నా "పండుబారిన ముసలితనంలోని అనుభవం ఎంత గొప్పదో కదా" అని కూడా అనుకొంటూ వడివడిగా అడుగులు వేస్తున్న శివరామశాస్త్రి మంత్రించినట్లు స్థాణువులా నిలబడిపోయాడు.

ఆయన చూపులు కాలుతున్న కాష్ఠం దగ్గర ఆగిపోయాయి. ఎర్రని ఆ మంట వెలుగులో కళ్ళనీళ్ళు నింపుకొని ముభావంగా నిలబడి వున్న అవధూత స్వామి!

"అవును. ఆ కాష్ఠమువద్ద నిలబడ్డది సందేహం లేకుండా అవధూతస్వామే! ఆ దిగంబర సన్యాసికి ఆ చితిమంటలవద్ద ఏమి పని? అందునా ఎప్పుడూ ఏ భావాన్నీ కనబర్చని ఆ సన్యాసి కళ్ళల్లో నీళ్లా? నేను పొరపాటు పడడం లేదు కదా!" అని అనుకొంటూ ఆ అవధూతస్వామికి దగ్గరగా వెళ్లాడు శివరామశాస్త్రి.

శాస్త్రిని చూచాడు స్వామి! ఎంతోమంది మ్రొక్కుతారు శాస్త్రికి! కాని శాస్త్రి మాత్రం ఒక్క స్వామిముందు తల ఒగ్గుతాడు, శివుని తరువాత!

స్వామి కళ్లు చిత్రంగా వున్నాయి. అరుణజ్యోతుల్లా మెరుస్తున్నాయి.

శాస్త్రికి అంతా ఆశ్చర్యంగా ఉంది.

స్వామి గట్టిగా ఏడ్చాడు. అచ్చం పసిపిల్లవాడిమాదిరి! మరుక్షణం అంతకంటే గట్టిగా నవ్వాడు. పిచ్చివాడిలాగున!

శాస్త్రిని చూస్తూ ఆకాశంవైపు చూస్తూ చితిమంటవైపు చూస్తూ శివాలయం వైపు చూస్తూ ఊరికి దక్షిణంగా వున్న మర్రిచెట్టువైపుకి నడుచుకొంటూ, పరుగెత్తుతూ వెళ్ళిపోయాడు ఆ అవధూతస్వామి!

ఒంటిమీద నూలుపోగు లేదు. తైలసంస్కారం అసలు లేదు. స్నానంచేసి ఎన్ని రోజులయిందో! మలమూత్రాల దుర్గంధం ఆ స్వామిని ఎప్పుడూ అంటుకొనే ఉంటాయి.

శివరామశాస్త్రి అవధూతస్వామిని గురించి ఆలోచిస్తూ నడవసాగాడు. స్వామి చేష్టలు ఎప్పుడూ అంతే! అంతుబట్టవు. అసహ్యంగా, ఆందోళనగా, అద్భుతంగా, బీభత్సంగా, ఘోరాతి ఘోరంగా, పరమ నికృష్టంగా ఉంటాయి,

మలాన్ని గంధంలాగా పూసుకొని తిరుగుతాడు ఒకరోజు!

అవుపేడను ఫలహారంలాగా భోంచేస్తాడు ఇంకొకరోజు!

పళ్ళెంలో పెట్టిన సంగటి ముద్దను గజ్జికుక్కతో సహా పంచుకొంటాడు మరో రోజు!

పందులమధ్య పడుకొని నిశ్చింతగా నిద్రపోతూ వుంటాడు ఇంకోరోజు!

దిగంబరంగా చలిరాత్రుల్లో శ్మశానాల వెంటబడి తిరుగుతాడు.

సమాధులపైన వెల్లకిలా పడుకొని ఆకాశంలోకి చూస్తూ ఉంటాడు. నేలమీది బొరియల్లో చేయిపెట్టి ఏదో వెదుకుతూ వుంటాడు. విషక్రిములను సైతం అరచేతిలో పెట్టుకొని అదేపనిగా చూస్తుంటాడు.

మనిషి రూపంలో వున్న మృగం అనిపిస్తుందొకసారి.

కాదు మహానుభావుడు అని తోస్తుంది మరోసారి.

శివరామశాస్త్రి అవధూతస్వామిని మూడేళ్ళుగా చూస్తున్నాడు. ఎప్పుడు చూచినా ఇదే తంతు! ఎప్పటి కప్పుడు కొత్తగా వింతగా అగుపిస్తాడు అవధూత స్వామి!

అతణ్ణి ఎవరూ ఏమీ అనేవారు కాదు. అతడి దయ కలిగితే చాలు అదృష్టం వరించినట్లే భావించేవారు.

ఎవరి ఇంటిని ఎప్పుడు ఏ మేరకు ఖరాబు చేసేవాడో ఎవరికీ తెలిసేది కాదు.

ఆ స్వామి నీడ పడినచోట లక్ష్మి తాండవిస్తుందని ఎంతోమంది నమ్మేవారు. అది నిజమయ్యేది!?

ఆ స్వామి పాదం తగిలితే చాలు దారిద్ర్యదేవత తిరిగి చూడదని గ్రామం మొత్తం కూడబలికేది. అది వాస్తవమయ్యేది!?

అందుకే ఎవరికి వారు ఆ అవధూతస్వామి దర్శనభాగ్యం కోసం తపించి పోయేవారు.

ఆయనకు పళ్ళూ ఫలహారాలు, పాలూ, పిండివంటలూ ఎన్నో పెట్టేవారు.

ఆయన తింటే తినేవాడు. లేదా విసిరికొట్టేవాడు. కాకపోతే వాటిని కాలితో తొక్కేసేవాడు. లేకపోతే ఆయనకు తోచినవాళ్ళను పిలిచి పంచిపెట్టేవాడు.

అంతేకాని ఏం చేస్తాడో ఎవరికీ తెలిసేది కాదు.

ఒకరోజు పసులకొట్టంలో గడిపేవాడు.

ఒకరోజు దిగుడుబావి మెట్లమీదే ఉండేవాడు.

ఊరిచివర ఉన్న కొండపైనే కొన్ని రాత్రులు నివసించేవాడు. ఆ కొండకి దిగువగా వున్న చెరువు గట్టుమీద మిట్టమధ్యాహ్నపు ఎండల్లో హాయిగా పవళించేవాడు.

ఎప్పుడు ఎక్కడ ఎలా ఉంటాడో తెలిసేది కాదు.

ఆయన ఎవరో, ఎక్కడివాడో, ఎక్కడినుంచి వచ్చాడో ఎవరికీ తెలియదు.

ఆయన భాషేమిటో అంతుపట్టడం లేదు.

ఆ అవధూతస్వామికి మాటలే రావని అందరూ అనుకొనేవారు.

ఊరు మొత్తం ఆ దిగంబరసన్యాసి ఒక దేవతా స్వరూపమని విశ్వసించిందనే చెప్పవచ్చు.

అలాంటివాడు ఈ వేళ కాలిపోతున్న శవం దగ్గర నిలబడి కన్నీళ్ళు కార్చడమేమిటి?

చనిపోయిన జానకమ్మకు కూతురు దేవిక తప్ప మరెవ్వరూ లేరాయె!

మరి ఈ సన్యాసి ఎందుకేడుస్తున్నట్లు?

అవధూతలు అన్నింటికీ అతీతులు కదా! ఈ సంఘటన యాదృచ్ఛికమేనా?

మమకారాలే ఉండని సన్యాసులు కంటతడి పెడతారా?

ఈ సంఘటన వెనుక ఏదైనా నేపథ్యముందా?


శివరామశాస్త్రికి అంతుబట్టడం లేదు.

అలా ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్నాడాయన.

అన్యమనస్కంగానే భోజనం ముగించి నిద్రకుపక్రమించాడు.

అయినా నిద్రరావడం లేదు. ఆ అవధూతను గురించిన ఆలోచనలే!

మళ్ళీ ఆ అవధూత ఆ చితి దగ్గరికొచ్చాడేమో! అలా అనుకోవడమే తడవు శివరామశాస్త్రి లేచి నిలబడ్డాడు.



ఆ అర్ధరాత్రి నిర్మానుష్యంగా ఉన్న భీతావహ వాతావరణంలో శివరామ శాస్త్రి దత్తాత్రేయునిలాగా నడుస్తున్నాడు.

మరుభూమిని చేరుకొన్నాడు. రగులుతున్న కాష్ఠం దగ్గర బిగ్గరగా రోదిస్తున్న అవధూతస్వామిని చూడనే చూచాడు. "తన ఊహ నిజమే. ఆ స్వామికీ చనిపోయిన జానకమ్మకి ఏదో సంబంధముంది. అయితే ఆ సంబంధం ఎలాంటిదో ఏలా చెప్పడం?"

శివరామశాస్త్రిలో విస్మయంతో కూడుకొన్న ఎన్నో సందేహాలు!

ఏదో నిశ్చయించుకొన్న వాడిమల్లే ముందుకు కదిలాడు.

రోదిస్తున్న స్వామి దగ్గరకి వెళ్ళాడు. చేతులు జోడించి నిలబడ్డాడు.

నెమ్మదిగా అతి కష్టంగా అన్నాడు.

"స్వామీ! మీరెప్పుడూ ఇలా రోదించింది నేను చూడలేదు. సర్వసంగ పరిత్యాగులైన మీరు కూడా ఇలా దుఃఖించడం నాకు ఆశ్చర్యంగా ఉంది. చనిపోయిన ఈ జానకమ్మపట్ల మీరెందుకింత మమకారాన్ని కనబరుస్తున్నారు. తెలుసుకోవచ్చా?"

అవధూతస్వామి తలెత్తి సూటిగా శివరామశాస్త్రి కళ్ళల్లోకి చూచాడు.

మౌనంగా ఉండిపోయాడు.

"చెప్పండి స్వామీ! ఎందుకాగిపోయారు? మీ భాష ఏదైనా నేను అర్థం చేసుకొంటాను, సైగ చేసినా చాలు! పోతే నేను అర్థం చేసుకొని చేసేదేమిటని అనుకోకండి. ఒక మనిషిగా మనిషికి సహాయపడడంలో ఎంతో తృప్తి ఉంటుంది. ఆ తృప్తి మోక్షంకంటే కూడా గొప్పది" శివరామశాస్త్రి అన్నాడు.

అవధూతస్వామి ముందుకు కదిలాడు.

సన్నని తుంపర మొదలయింది. ఉత్తరదిశగా మెరుపు మెరిసింది.

ఆకాశం భారంగా ముభావంగా వుంది. భూమాత స్తబ్ధంగా మవునంగా తిలకిస్తోంది.

"చెప్పండి స్వామీ" మళ్ళీ శివరామశాస్త్రి అన్నాడు.

"శివా" అని పలికాడు అవధూతస్వామి.

మేఘగర్భం చీలినట్లుంది. కుండపోతగా వర్షం ప్రారంభమయింది.

"శివా" మళ్ళీ అన్నాడు అవధూతస్వామి.

శివరామశాస్త్రికంతా అయోమయంగా వుంది.

చేతనాచేతనావస్థలో ఉండిపోయాడు.

"శివా! శివా! శివా! శివా!"...

ఆ పలుపు పదైదు సంవత్సరాల క్రితం తనకెంతో ప్రాణప్రదమైన ప్రాణమిత్రుని పిలుపు! అంటే అవధూతస్వామి తన ప్రాణమిత్రుడు గణపతి శాస్త్రి?"

ఊహించలేకపోతున్నాడు శివరామశాస్త్రి.

"శివా! ఆశ్చర్యంగా ఉందా? నేను, నేనా గణపతిని." అంటూ వలవల మంటూ ఏడ్చాడు అవధూతస్వామి.

శివరామశాస్త్రికి నోట మాట రాలదు.

"ఏరా మాట్లాడవ్! ఇప్పుడర్థమయిందా నేనీ చితి ముందు నిలబడి ఎందుకేడుస్తున్నానో—" అవధూతస్వామి మాటలకు అడ్డు తగిలాడు శివరామశాస్త్రి.

"గణపతీ! నువ్వు గంగా ప్రవాహంలో కొట్టుకొని పోలేదా? నీవు చనిపోయావనే అనుకొన్నాం కదరా! బ్రతికుండి కూడా ఎందుకు తిరిగి రాలేదు. ఇదంతా నిజమేనా? నీవు అసలు గణపతివేనా?"

శివరామశాస్త్రికి ఆవేదన, ఉద్వేగం రెండూ ఎక్కువయ్యాయి.

గణపతి కళ్ళు మూసుకొనే అన్నాడు.

"శివా! నే చనిపోలేదు. దూరతీరాలకు కొట్టుకుపోయాను. అక్కడొక ఋషితో పరిచయం కలిగింది. సంసారంమీద రోత పుట్టింది. సర్వసంగ పరిత్యాగినయ్యాను. అంతటితో ఆగిపోలేదు. అవధూతను...పరమావధూతను కావాలనుకొన్నాను. పెంటకుప్పల్నీ, లడ్డుముక్కల్నీ ఒకేలా చూడటం నేర్చుకొన్నాను. పడుచుపిల్ల సౌందర్యాన్నీ పసిపాప బోసినవ్వునీ ఒకేలా చూడడానికి అలవాటు పడ్డాను. మౌనమనే భాషను నేర్చుకొన్నాను. నా భాషను పూర్తిగా దూరం చేసుకొన్నాను. రాగద్వేషాలకు అతీతంగా ఉంటూ వచ్చాను. కామాన్ని జయించాలని ఎంతో తాపత్రయపడ్డాను. కొన్ని సందర్భాలలో కామపరమైన కోరికలను అదుపులో పెట్టడానికిగాను నా శరీరాన్ని నేను కృశింపజేసుకొన్నాను. లైంగికపరమైన ఆలోచనలే నాలో రాకుండా అనుక్షణం జాగ్రత్తపడ్డాను. ఇప్పుడెలాగూ ముసలివాడినయ్యాను. ఈ అంత్యదశలో ఎందుకోమరి జానకినీ, నా బిడ్డ దేవికనూ చూడాలనిపించింది. విచిత్రమైన ఈ కోర్కెను చూచి నాపై నాకే నవ్వు వచ్చింది. కాని కోర్కెను అణచుకోలేకపోయాను. అందుకే జానకిని వెదుక్కుంటూ ఇక్కడికొచ్చాను. వైధవ్యంతో, దారిద్ర్యంతో బాధపడుతున్న జానకిని చూచి మనసు ద్రవించినా విచలించలేదు. పెళ్ళీడుకొచ్చిన దేవిక నన్ను భయంతోనో భక్తితోనో మ్రొక్కితే మనసు స్పందించేది కాని మారేది కాదు. చిన్ననాటి మిత్రుడవయిన నిన్ను చూచినప్పుడల్లా ఆరాటం కలిగేది కాని అభిమానం పుట్టుకొని వచ్చేదికాదు. విడ్డూరమేమిటంటే నన్నెవరూ ఈషణ్మాత్రంగానైనా గుర్తుపట్టలేకపోయారు. కట్టుకొన్న భార్య సైతం నా దగ్గరికొచ్చి నాకు నమస్కరించేది కాని నేనే తన భర్తనని గుర్తించలేకపోయింది, ఈ జగన్నాటకంలో నా జీవితం విచిత్రమైందని అనుకొంటూ కాలం గడిపేవాణ్ణి. హఠాత్తుగా హృద్రోగంతో జానకి మరణిస్తే నిర్వికారంగా ఉండలేకపోయాను. అలా అని హృదయానికి హత్తుకొని మనస్ఫూర్తిగా రోదించలేకపోయాను. తండ్రి వుండి కూడా దిక్కులేని అనాథలా విలపిస్తున్న చిట్టితల్లి దేవికను చూచి మనసు హైరానా పడేదేకాని ఊరడించలేకపోయింది. అందుకే ఈ చితిదగ్గర...అర్ధరాత్రి...బిగ్గరగా రోదిస్తున్నాను. సంజెమంటలు ఆర్పుకొంటున్నాను. శివా-ఏమిరా మాట్లాడవు? ఇప్పటికీ నీకు నమ్మశక్యంగా లేదా?"—

గణపతి మాటలకు మ్రాన్పడిపోయాడు శివరామశాస్త్రి.

"లేదురా గణపతీ! నమ్ముతున్నాను. నా ప్రియమిత్రుణ్ణి నేను అనుమానించడమేమిటి? ఊరుకోరా! ఊరుకో! ఏడవకు! ఏనాటికైనా ఎడబాటు తప్పదు. ఎవరూ విధిని ఎదిరించలేరు. అందరమూ వెళ్ళిపోయేవాళ్ళమే-"

శివరామశాస్త్రి మాటలకు చిత్రంగా నవ్వాడు గణపతి.

"నేనొకటి కోరుతాను. చేస్తావా?"

గణపతి మాటలకు సరేనని సమాధానమిచ్చాడు శివరామశాస్త్రి.

"నా కూతురు దేవికను నీ కోడలిగా స్వీకరిస్తావా? అంతిమ ఘడియలో హాయిగా, ఆనందంగా వెళ్ళిపోతాను."

"అవధూతస్వామి కోరిక ఎలాంటిది?" శివరామశాస్త్రి మనసులోనే ఆశ్చర్యపడ్డాడు. నవ్వుకొన్నాడు. స్థిరనిశ్చయంతో అన్నాడు.

"గణపతీ! అలాగే! నే నిత్యం కొలిచే శివుని సాక్షిగా చెబుతున్నాను. నీ కూతురు దేవిక నా ఇంటి కోడలవుతుంది."

"తథాస్తు" అని మాత్రమే ఉచ్చరించి కుప్పలా కూలిపోయాడు గణపతి.

"గణపతీ" అంటూ అదుర్దాగా చేయి పట్టుకొన్నాడు శివరామశాస్త్రి.

కళ్ళు తెరవలేదు గణపతి. శ్వాసని ఆపివేశాడు. కొద్దిసేపట్లోనే ఒళ్ళు చల్లబడిపోయింది. మరి కాస్సేపటికే అది గట్టిపడిపోయింది.

అవధూతస్వామి పరమపదించాడు.

మమకారం అనే బంధంనుంచి కూడా తప్పించుకొన్నాడు.

శివరామశాస్త్రి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

చిన్ననాటి స్నేహానికి ఆనవాళ్ళుగా అనుభూతులు మిగిలాయి.

శాస్త్రి ఏదో నిశ్చయానికొచ్చాడు.

సరిగ్గా అప్పుడే ప్రాగ్దిశలో వెలుగు వచ్చింది. □